క్లుప్తంగా

రేపు మూడు దేవస్థానాల హుండీల లెక్కింపు

పాత గుంటూరు: దేవదాయ శాఖ పరిధిలోని కొత్తపేటలోని శ్రీ జగన్నాథస్వామి ఆలయం, శ్రీ ఆంజనేయస్వామి ఆలయం, లాలాపేట శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానాల హుండీల లెక్కింపు ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు సహాయ కమిషనర్ డి. శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారుల సమక్షంలో మధ్యాహ్నం 12 గంటలకు లెక్కింపు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

నలుగురు వ్యాపారులపై కేసులు



నెహ్రూనగర్: ఎమ్మార్పీ కంటే అధికంగా వస్తువుల్ని విక్రయిస్తే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ సునీల్ రాజు తెలిపారు. ఆయన సోమవారం జీజీహెచ్ ఎదురుగా ఉన్న పలు దుకాణాల్లో వస్తువుల్ని తనిఖీ చేశారు. అధిక ధరలకు విక్రయాలు జరుపుతున్న నలుగురు వ్యాపారులపై కేసులు నమోదు చేశారు.

నగరపాలక సంస్థ కార్యాలయంలో బైక్ చోరీ

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కార్యాలయంలో పట్టపగలే బైక్ దొంగతనం కలకలం రేగింది. వివిధ పనుల నిమిత్తం నిత్యం కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చే వందలాది మంది ప్రజలతో పాటు సెక్యూరిటీ సిబ్బంది ఉన్నప్పటికీ చోరీ అవ్వడం ఆశ్చర్యాన్ని కలిగించింది. నగరానికి చెందిన కట్టా నవీన్‌కుమార్ పట్టణ ప్రణాళిక విభాగంలో పని నిమిత్తం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చారు. యూనియన్ బ్యాంకు దగ్గరలో బైక్ పార్క్ చేసి లోపలకు వెళ్లారు. ఐదు నిమిషాల్లో తిరిగి వచ్చేసరికి పార్క్ చేసిన పల్సర్ బైక్ మాయమైంది. బ్యాంక్ సీసీ కెమెరాలు కూడా బైక్ తీసుకువెళ్లిన వ్యక్తిని కవర్ చేయలేక పోయాయి. గతంలోనూ కార్పొరేషన్ కార్యాలయంలో బైక్ చోరీలు జరిగాయని, ఉన్నతాధికారులు దృష్టి సారించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఉద్యోగులు, నగర ప్రజలు కోరుతున్నారు.

మొబైల్ షాపులో చోరీ

గుంటూరు ఈస్ట్: మొబైల్ షాపులో చోరీపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. బ్రాడీపేట 4/7లోని మొబైల్ షాపులో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పైకప్పుకు రంధ్రం చేసి లోపలకు ప్రవేశించి, రూ. 30వేలు చోరీ చేశారు. షాపు యజమాని కట్టా వీరాంజనేయులు ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి మృతిపై కేసు నమోదు



వృద్ధుడు మృతి చెందిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేటకు చెందిన మహేష్ (65) ఒంటరిగా నివసిస్తూ, అరండల్‌పేట 6వ లైనులోని ఓ అపార్టుమెంట్‌లో వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. సోమవారం విధుల్లో ఉన్న సమయంలో కుర్చీలోనే కూర్చొని మృతి చెందాడు. బంధువులు ఎవరన్నది వివరాలు తెలియలేదు. మృతదేహాన్ని పోలీసులు మార్చురీకి తరలించారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 8688831332 నంబరుకు సంప్రదించాలని కోరారు.

అభివృద్ధి పనులపై ఇంత నిర్లక్ష్యమా !?

- అధికారుల తీరుపై నిప్పులు చెరిగిన ఎమ్మెల్యే ముస్తఫా
- యూజీడీ పనులు అస్తవ్యస్తంగా జరిగాయని ఆరోపణ
- అధికారులపై విచారణ చేయించాలని డిమాండ్
- జిల్లా కలెక్టర్, జీఎంసీ కమిషనర్ ఫిర్యాదు



అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: నగరాభివృద్ధి పనులపై ఇంత నిర్లక్ష్యమా.. డయేరియా బారిన పడితే ఎవరిది బాధ్యత.. మంచి పనులు చేస్తూ.. ప్రజల్లో పేరును తెచ్చుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకుని వచ్చే విధంగా వ్యవహరిస్తున్నారా..? స్థానిక ఎమ్మెల్యేని ఎన్నిసార్లు చెప్పినా నిర్లక్ష్యధోరణి వీడటం లేదు.. ఇష్టానుసారంగా వ్యవహరిస్తే జిల్లా ఉన్నతాధికారులు.. ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తానని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కార్పొరేషన్ అధికారుల తీరుపై నిప్పులు చెరిగారు. పాత గుంటూరు పరిధిలోని పలు ప్రాంతాల్లో యూజీడీ పైపులైను మురుగు నీరు రోడ్ల పైకి వస్తోందని స్థానికులు ఎమ్మెల్యే ముస్తఫా దృష్టికి తెచ్చారు. మురుగునీటి వల్ల రోగాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఎమ్మెల్యే 10 డివిజన్‌పరిధిలోని జన్నుసైదానగర్, అల్లీనగర్, నయ్యూఖాన్‌స్ట్రీట్, సుద్దపల్లి డొంకలో సోమవారం పర్యటించి సమస్యను గుర్తించే ప్రయత్నం చేశారు. అయితే, కార్పొరేషన్ అధికారులు మాత్రం ఎటువంటి సమస్య లేదని చెప్పినా..ప్రతి మ్యాన్‌హోల్‌ను తెరిపించి ఎమ్మెల్యే ముస్తఫా పరిశీలించారు. క్రైస్తవ శ్మశానవాటిక వద్ద మూత తీయగా సుమారు 6నుంచి 8 అడుగులు యూజీడీ పైపులైను ఇసుక బస్తాలు వేసి బ్లాక్ చేసి ఉండటాన్ని గమనించారు. పలుచోట్ల మట్టి పేరుకుపోయి ఉండటంతో సెప్టిక్ ట్యాంక్ లారీని పిలిపించి ఆయనే స్వయంగా బాగు చేయించారు. క్రైస్తవ సమాధుల వద్ద మాత్రం ఎందుకు బ్లాక్ చేశారని అధికారుల్ని నిలదీయడంతో సమాధానం చెప్పలేక తెల్ల మొహాలు పెట్టారు. దీనిపై సమాధానం చెప్పాల్సిందేనని.. ఎమ్మెల్యే ముస్తఫా భీష్మించారు. యూజీడీని బ్లాక్ చేసి.. పక్కనే ఉన్న చిన్న కాలువకు కనెక్షన్ ఇవ్వడంపై ప్రశ్నించడంతో అధికారులు నీళ్లు నమిలారు.



యూజీడీ డ్రైయిన్‌లో మట్టి గోతాలు

సమస్య గురించి అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకుని వచ్చినా.. ఎందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తానని స్పష్టం చేశారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

యూజీడీ పనుల్లో భాగంగా అవకతవకలకు పాల్పడిన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ముస్తఫా కోరారు. యూజీడీ పైపులైన్లు బ్లాక్ చేయటంపై విచారణ జరపాలని, సంబంధిత డీఈ కళ్యాణ్‌రావును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రూ. 90లక్షలతో యూజీడీ పనులు చేపట్టిన ప్రాంతంలో ఇసుక బస్తాలు పెట్టడం సరికాదని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి పనుల కోసం కోట్లాది రూపాయలు కేటాయిస్తుంటే.. అధికారులు ఈ విధంగా వ్యవహరించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

జగనన్న సురక్ష అమలుకు ప్రత్యేక బృందాలు

- నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి
- నగరంలో ఎనిమిది ప్రత్యేక బృందాల ఏర్పాటు



సెక్రటరీలకు ట్యాబ్‌లను అందజేస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: జగనన్న సురక్ష కార్యక్రమం అమలుకు నగరపాలక సంస్థ ఉన్నతాధికారులతో వార్డుల వారీగా ఎనిమిది ప్రత్యేక బృందాల్ని ఏర్పాటు చేశామని నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. వలంటీర్లు, కార్యదర్శులు పూర్తిస్థాయిలో విధుల్లో ఉండేలా చూడాలని ఆమె విభాగాధిపతుల్ని ఆదేశించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో సోమవారం అదనపు కమిషనర్, డెప్యూటీ కమిషనర్లు, విభాగాధిపతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్నదని, ప్రతి అధికారి అధిక ప్రాధాన్యతగా తమ పరిధిలోని వార్డు సచివాలయాల్లో కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. వలంటీర్లు తప్పనిసరిగా విధుల్లో ఉంటూ ప్రతి ఇంటిలో ప్రభుత్వ పథకాలు అందుతున్న లబ్ధిదారులు, అర్హులు, అనర్హుల వివరాలతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. అనధికార, బకాయిలు చెల్లించని ప్రకటనల హోర్డింగ్స్, బోర్డుల్ని వెంటనే తొలగించాలని సిటీ ప్లానర్‌కు స్పష్టం చేశారు. నగరంలో ఎక్కడా తాగునీటి సరఫరాపై ఫిర్యాదులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు చెప్పారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనుల్లో జాప్యం కనిపిస్తోందని, నోడల్ అధికారులు మరింత చొరవ చూపి వేగవంతం చేయాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ నిర్ణయం మేరకు నూతనంగా టెండర్ పిలిచే వరకు నగరంలో వీధి వ్యాపారుల నుంచి ఆశీలు వసూళ్లు నిలిపి వేసినట్లు వెల్లడించారు. ఎక్కడైనా వసూలు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ భాస్కర్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, మేనేజర్ శివన్నారాయణ, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ప్లానింగ్ సెక్రటరీలకు ట్యాబ్‌లు అందజేత

నగరంలో రీసర్వే వేగవంతం చేయడానికి గానూ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులకు రాష్ట్ర ప్రభుత్వం ట్యాబ్‌లను అందించిందని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో ప్లానింగ్ కార్యదర్శులకు ఆమె వాటిని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న భూ హక్కు-భూ రక్షలో భాగంగా ప్రభుత్వం రీసర్వే చేపట్టిందని తెలిపారు. నగరంలో ఇప్పటికే 86 శాతం పూర్తయిందన్నారు. ప్రభుత్వం అందించిన ట్యాబ్‌ల ద్వారా వేగంగా నూరు శాతం చేపట్టడానికి వీలు కలుగుతుందన్నారు. తమకు నిర్దేశించిన ప్రణాళిక మేరకు సర్వే పూర్తి చేయాలని ప్లానింగ్ కార్యదర్శుల్ని ఆదేశించారు.

ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలి

జగనన్నకు చెబుదాం, స్పందనకు అందే ఫిర్యాదుల్ని విభాగాధిపతులే నేరుగా పరిశీలించాలని, ఏ ఒక్కటీ పునరావృతం కాకుండా శాశ్వత ప్రాతిపదికన పరిష్కారానికి కృషి చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా జగనన్నకు చెబుదాం, స్పందన పోర్టల్, ఈఆర్పీ, వాట్సాప్, కాల్ సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదులపై అధికారులు, సంబంధిత సిబ్బందితో కమిషనర్ సమీక్షించారు. ప్రజల సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ప్రజల నుంచి 36 ఫిర్యాదులు

ప్రజల నుంచి స్పందనకు 36 ఫిర్యాదులు అందాయి. వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 15, ఇంజినీరింగ్ విభాగానికి 11, రెవెన్యూ విభాగానికి 3, ప్రజారోగ్య విభాగానికి 4, ఉపా సెల్ విభాగానికి 2, పరిపాలన విభాగానికి 1 చొప్పున ఉన్నాయి. ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారుల్ని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ భాస్కర్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, బయాలజిస్ట్ మధుసూదన్, మేనేజర్ శివన్నారాయణ, ఏసీపీలు, ఈఈలు, ఎస్ఎస్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్‌కు మేయర్ అభినందన



శంకరరావును అభినందిస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: అమెరికన్ ఇమేజ్ కొలిగి సొసైటీ(ఏఐసీయస్) దామచర్ల శంకరరావుకి ఉత్తమ ఫొటోగ్రాఫర్‌గా ప్రశంసా పత్రం పంపించడం అభినందనీయమని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు తెలిపారు. సోమవారం శంకరరావు మేయర్‌ను సంపత్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మేయర్ ఆయన్ను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అరకు, పాడేరు, ఒరిస్సా ప్రాంతాల్లో కొండలపై జీవనం సాగించే బోండా తెగ గిరిజనులపై ఛాయా చిత్రాలు తీసి వారి జీవన శైలిని ప్రపంచానికి తెలిసేలా చేసిన శంకరరావుకు ఏఐసీయస్ ప్రశంసా పత్రాన్ని అందజేయడం నగరానికి గర్వకారణమని పేర్కొన్నారు. గుంటూరు ఫొటోగ్రాఫిక్ అండ్ ఎలైడ్ ట్రేడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పాట్వా) ప్రధాన కార్యదర్శిగా శంకరరావు సేవలు ప్రశంసనీయమని తెలిపారు. ఫొటోగ్రఫీలో కొత్త టెక్నాలజీపై అసోసియేషన్ సభ్యులకు అవగాహన కల్పించడానికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో 57వ డివిజన్ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నూర్, ఫొటోగ్రాఫిక్ అండ్ ఎలైడ్ ట్రేడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పాట్వా) అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు షరీఫ్, జాయింట్ సెక్రటరీ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

శారదా నికేతన్‌లో వాటర్ సిస్టమ్ ప్రారంభం



వాటర్ సిస్టమ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, డీవైఈవో వెంకటేశ్వరరావు, సురేష్

గుంటూరు ఎడ్యుకేషన్: లయన్స్ క్లబ్ ఆఫ్ గుంటూరు పట్టాభిపురం ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని శ్రీ శారదానికేతన్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన వాటర్ సిస్టమ్‌ను సోమవారం ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నారై శాఖమూరి సత్యనారాయణ, రాజరాజేశ్వరి దంపతుల సహకారంతో విద్యార్థినులకు ఉపయోగపడే విధంగా రూ.50వేల వ్యయంతో వాటర్ సిస్టమ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వైద్య శిబిరాలు, వృద్ధులకు దుస్తుల పంపిణీ, వంట సామగ్రి పంపిణీ వంటి కార్యక్రమాల్ని నిర్వహించడంలో లయన్స్ క్లబ్ ముందుంటోందని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం చైర్మన్‌గా నియమితులైన నిడమనూరి సురేష్‌ను ఎమ్మెల్సీ లక్ష్మణరావు సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ నూతలపాటి వీరప్రకాశరావు, జిల్లా ఇంచార్జి గవర్నర్ పి. గోపీచంద్, డీవైఈవో వెంకటేశ్వర్లు, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసీం, హెచ్ఎం ఉషా కుమారి, లయన్స్ క్లబ్ సభ్యులు వెంకటసుబ్బయ్య, మున్నలూరి గౌరీశంకర్, రమణ శ్రీనివాస్, ఆంజనేయులు, సురేష్ పాల్గొన్నారు.

డ్రగ్స్ భూతాన్ని తరిమికొట్టాలి



విద్యార్థుల మానవహారం

సెబ్ జిల్లా ఏఎస్పీ డీఎస్.మహేష్



మహిళా మండలిలో అవగాహన ర్యాలీ

నగరంపాలెం: ఏపీని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే దిశగా సీఎం వై.ఎస్. జగన్ కృషి చేస్తున్నారని ఎస్ఈబీ (సెబ్) జిల్లా ఏఎస్పీ డీఎస్.మహేష్ అన్నారు. సెబ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా హిందూ కళాశాల కూడలిలో మానవహారం, కొత్తపేట మహిళా మండలితో పాటు వివిధ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మహేష్ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని సూచించారు. చెడు వ్యసనాలకు బానిసకావద్దని చెప్పారు. డ్రగ్స్‌కు బానిసై కుటుంబ సభ్యులకు దుఃఖాన్ని మిగల్చవద్దని అన్నారు. డ్రగ్స్ భూతాన్ని ప్రతి ఒక్కరూ తరిమికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. నాటుసారా, గంజాయి, జూదం, ఇసుక అక్రమ రవాణా, అక్రమ మద్యం వినియోగంపై టోల్ ఫ్రీ నంబర్ 14500కు సమాచారం అందించాలని ప్రజల్ని కోరారు.అనంతరం మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ జడ్జి చంద్రమౌళీశ్వరి, సెబ్ గుంటూరు సూపరింటెండెంట్ ఎన్.అన్నపూర్ణ, ఏఈఎస్ కె.మణికంఠ, గుంటూరు-1, 2 స్టేషన్ల సీఐలు ఎం.రమేష్, కె.కర్ల, తూర్పు ట్రాఫిక్ పీఎస్ సీఐ నిస్సార్ బాషా, ఎస్ఐలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సంఘ సేవలు అభినందనీయం



విద్యార్థినికి ఉపకార వేతనాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ అడకా పద్మావతి

గుంటూరు ఎడ్యుకేషన్: పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించడం అభినందనీయమని 24వ డివిజన్ కార్పొరేటర్ అడకా పద్మావతి పేర్కొన్నారు. ఏటీ అగ్రహారంలోని ఎస్‌కేబీఎం నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలల్లో సోమవారం పూర్వ విద్యార్థుల సంఘ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆరో తరగతి నుంచి టెన్త్ వరకు చదువుతున్న విద్యార్థుల్లో 74 మందికి రూ.1.32 లక్షలతో పాటు ప్రశంసా పత్రం, జ్ఞాపికల్ని బహూకరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పద్మావతి మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థుల్ని ప్రోత్సహించేందుకు పూర్వ విద్యార్థులు ముందుకు రావడం మంచి పరిణామమని అన్నారు. 2017 నుంచి ఏటా ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెంచుకునేందుకు కార్యక్రమం ఉపయోగపడుతుందని వారు వివరించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ నఫీసా, హెచ్ఎం పి. శ్రీనివాసరావు, విశ్రాంత హెచ్ఎం మోహన్‌రావు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు శ్యామ్ ప్రసాద్, కార్యదర్శి బాషా, శైలజ, మంజుషా, కోటేశ్వరరావు, ఆళ్ల వీరభద్రరావు, శ్రీనివాసరావు, చెవుల శ్రీనివాసరావు, జగదీష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ర్యాంప్ వాక్



పాత గుంటూరు: విద్యానగర్‌లోని హోటల్‌లో మేకప్ లేబరేటరీ అకాడమీ, ముకేష్ బ్యూటీ వరల్డ్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం జాతీయ బ్యూటీషియన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళల ర్యాంప్ వాక్ ఆకట్టుకుంది. మేకప్ ఆర్టిస్ట్ వేణు శ్రీరెడ్డి కాస్మెటిక్స్, మేకప్‌పై అవగాహన కల్పించారు. అనంతరం వాక్‌లో ప్రతిభ చూపిన యువతులకు ప్రశంసాపత్రాల్ని అందించారు. కార్యక్రమంలో బ్యూటీ వరల్డ్ డైరెక్టర్ ముకేష్, బ్యూటీషియన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వారాహి యాత్ర ప్రజల కోసమా.. చంద్రబాబు కోసమా?

గుంటూరు రూరల్: పవన్ కల్యాణ్ వారాహి అంటే యుద్ధ ట్యాంకర్ అనుకొనే భ్రమలో ఉన్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర బ్రాహ్మణ అధ్యయన కమిటీ సభ్యుడు కోసూరి సతీష్ శర్మ పేర్కొన్నారు. నగర శివారులోని ఆయన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమం నేరుగా ప్రజలకు అందుతున్న తీరు వాస్తవం కాదా ? అని ప్రశ్నించారు. ఎన్నికల మేనిఫెస్టో లేకుండానే వారాహిలో యాత్ర చేస్తున్న పవన్‌ను ప్రజలు ఎందుకు ఆదరించాలన్నారు. చంద్రబాబును సీఎం చేయాలనే కోరిక తప్పా వేరే ఆలోచన పవన్ కల్యాణ్‌కు లేదని తెలిపారు.

అప్రమత్తతతోనే విద్యుత్ ప్రమాదాలకు చెక్

- ఉమ్మడి జిల్లాలో పెరిగిన ప్రమాదాలు
- ప్రస్తుత వర్షాకాలంలో గృహ వినియోగదారులు, రైతులు జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి

గుంటూరు ఈస్ట్: ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇటీవల తరచూ విద్యుత్ ప్రమాదాలు వాటిల్లి ప్రజలు, పశువులు మృత్యువాత పడుతున్నాయి. మానవ తప్పిదాల వల్లే ఎక్కువ జరుగుతున్నాయి. గృహ వినియోగదారులు, రైతులు అవగాహనతో పాటు జాగ్రత్తలు తీసుకుంటే వాటిని నివారించవచ్చని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు.

గృహ వినియోగదారులు పాటించాల్సిన జాగ్రత్తలు

- ఇంటికి ఎర్త్ ఇచ్చిన సమయంలో కనీసం రెండు ఎర్త్ ఎలక్ట్రోడ్‌లను అమర్చాలి
- గ్రైండర్, ఏసీ, రిఫ్రిజిరేటర్లలో అసాధారణ శబ్దాలు వచ్చినప్పుడు అశ్రద్ధ చేయకుండా వెంటనే నైపుణ్యం కలిగిన ఎలక్ట్రీషియన్‌తో మరమ్మతులు చేయించాలి
- ఒకే ప్లగ్ పాయింట్ నుంచి లూజు వైర్లు, తాత్కాలికంగా అనేక పరికరాలకు కలపకూడదు. ప్లగ్ తీసేటప్పుడు వైర్లు లాగకూడదు
- గృహ విద్యుత్ ఉపకరణాలు వాడే సమయంలో వాటి తయారీదారుడు నిర్దేశించిన సామర్థ్యం కలిగిన మూడు పిన్నుల ప్లగ్ సాకెట్‌ను వాడాలి. మూడో పిన్నును విధిగా ఎర్త్ చేయించాలి
- విద్యుత్ షాక్ తగలకుండా ఇళ్లలో 30ఎం యాంప్ సామర్థ్యం ఉన్న ఆర్సీసీబీ, ఈఎల్సీబీలను విద్యుత్ వలయాల్లో చట్టప్రకారం విధిగా ఉపయోగించాలి. ఏదైనా పరికరం సరిగా పనిచేయడం లేదని గుర్తిస్తే సొంతంగా మరమ్మతులు చేయకుండా అధికారిక ఎలక్ట్రీషియన్‌ను సంప్రదించి వారితో చేయించాలి



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

- ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురైన వ్యక్తిని రక్షించే క్రమంలో బాధితుడిని చేతులతో తాకకుండా ఎండిన కర్రలతో తీగల నుంచి వేరు చేయాలి. వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేయాలి
- ప్రయాణించే వాహనాలపై ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు జారిపడినా, వాహనానికి తగిలినా, వాహనం నుంచి ముందుకు దూకి తప్పించుకోవాలి

రైతులు, కూలీలు పాటించాల్సిన భద్రత చర్యలు

- వ్యవసాయ పంపు సెట్లకు మోటారు, స్టార్టర్లు, స్విచ్‌లు ఉన్న ఇనుప బోర్డులు విధిగా ఎర్తింగ్ చేయాలి. విద్యుత్ షాక్ తగలకుండా 30ఎంఏ సామర్థ్యం కలిగిన ఆర్సీసీబీని మాత్రమే ఉపయోగించాలి
- తడి చేతులు, నీటిలో నిలబడి విద్యుత్ మోటారు స్విచ్‌లను సంబంధిత విద్యుత్ పరికరాలు తాకరాదు
- విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతుల నిమిత్తం ఎక్కరాదు
- విద్యుత్ ధ్రువపత్రం ఉన్న ఎలక్ట్రీషియన్‌ను మాత్రమే మరమ్మతులు చేయించుకునేలా చూసుకోవాలి
- పొలాల్లో తెగిపడిన, జారిపడిన, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లకు దూరంగా ఉండి, సంబంధిత విద్యుత్ శాఖ సిబ్బందికి ఫిర్యాదులు చేయాలి
- ఫిర్యాదు చేయడానికి టోల్‌ఫ్రీ నంబరు 1912
- పొలాల్లో పంటలను జంతు నుంచి రక్షించేందుకు ఏర్పరిచిన ఫెన్సింగ్‌లకు విద్యుత్ సరఫరా చేయకూడదు
- పాడైన విద్యుత్ వైర్లను ఇన్సులేషన్‌టేపుతో చుట్టాలి
- ఇన్సులేషన్, రబ్బరు తొడుగు ఉన్న పనిముట్లను మాత్రమే విద్యుత్ మరమ్మతులు చేసేందుకు ఉపయోగించాలి.

మృతుల సంఖ్య		
సంవత్సరం	మనుష్యులు	పశువులు
2022	108	58
2023	33	71

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి



విద్యుత్ వినియోగదారులు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి. అధికారులు సూచించిన జాగ్రత్తలు తప్పకుండా పాటించాలి. మానవ తప్పిదాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటిని నివారించేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యత వహించాలి.

– పి.కరుణాకర్, విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం ఇన్‌స్పెక్టర్

మహోన్నత వ్యక్తి ఛత్రపతి సాహూ మహారాజ్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

నెహ్రూనగర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవా సంఘం ఆధ్వర్యంలో ఛత్రపతి సాహూ మహారాజ్ 150వ జయంతిని కాకుమనువారి తోటలోని యానాది కాలనీ స్కూలులో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు అధ్యక్షత వహించి మాట్లాడారు. బహుజనుల హృదయాల్లో నిలిచిపోయిన వ్యక్తి ఛత్రపతి సాహూ మహారాజు అని పేర్కొన్నారు. తన రాజ్యంలో ప్రజాస్వామ్యవాదిగా కులాలకు, మతాలకు సంబంధం లేకుండా పరిపాలన సాగించి, ప్రగతిశీల విధానాల్ని అమలు చేశారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు చదువుకునేందుకు స్కూళ్లు, హాస్టల్స్ ఏర్పాటు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో వివిధ సంఘ నాయకులు ఉగ్గొ సాంబశివరావు, వి.వి. రమణయ్య, జి.ఆర్. భగత్ సింగ్ , సాంబయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ, సాంస్కృతిక సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న తిరుమలై రామన్

పాత గుంటూరు: రాజాగారితోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెల 27నుంచి 30 వరకు యువతను చైతన్యవంతుల్ని చేయడమే లక్ష్యంగా విద్యా, వైజ్ఞానిక, రాజకీయ, సాంస్కృతిక సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్. తిరుమలై రామన్, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నాలుగు రోజులు జరిగే కార్యక్రమంలో నిష్ణాతులైన అధ్యాపకులతో యువతకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశభక్తి, సమాజంలో బాధ్యత, యువత ఎదుర్కొంటున్న సవాళ్లు తదితర అంశాలపై పలువురు ప్రముఖులు ప్రసంగించనున్నట్లు తెలిపారు. సంఘం కోశాధికారి కోట మాల్యాద్రి, ప్రధాన కార్యదర్శి వలి, చైతన్య, షేక్ సుభాని పాల్గొన్నారు.